వెలుగుల పండగకు వేళాయె..


అమ్మకానికి సిద్ధం చేసిన ప్రమిదలు


ఆకట్టుకుంటున్న లక్ష్మీదేవి ప్రమిద


ఆర్ట్స్ కళాశాల మైదానంలోని బాణసంచా దుకాణం

- మొదలైన దీపావళి సందడి
- ఆకట్టుకుంటున్న ప్రమిదలు

సీటీఆర్ఐ: అందరూ ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్న వెలుగుల పండగ దీపావళి వచ్చేసింది. పండగ నేపథ్యంలో వాడవాడలా సందడి మొదలైంది. ముఖ్యంగా ప్రమిదల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సంప్రదాయబద్ధమైన ప్రమిదలతో పాటు వివిధ డిజైన్లలో రూపొందినవి ప్రజలకు బాగా ఆకట్టుకుంటున్నాయి. నెమలి, ఏనుగు, పల్లకి, అంబారీ, లక్ష్మీదేవీ, శ్రీకృష్ణుడు తదితర ఆకృతులలో ఈ ప్రమిదులు మార్కెట్‌లో లభిస్తున్నాయి.

బాణసంచా దుకాణాలు

ఆర్ట్స్ కళాశాల మైదానం, సుబ్రహ్మణ్యం మైదానం, మున్సిపల్ స్టేడియం గ్రౌండ్, మోరంపూడి జంక్షన్, క్వారీ మార్కెట్, ఏవీ అప్పారావు సెంటర్‌లోని రామాలయం వద్ద, అప్సర థియేటర్ వద్ద బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు.

దుకాణాల తనిఖీ

కంబాలచెరువు: నగరంలో ఏర్పాటు చేసిన దీపావళి బాణాసంచా దుకాణాలను జిల్లా ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆర్ట్స్ కళాశాల మైదానం, స్టేడియం రోడ్, సుబ్రహ్మణ్యం మైదానాల్లో దుకాణాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నాయా, భద్రత చర్యలు తీసుకుంటున్నారా అని ఆరాతీశారు. దుకాణదారుల లైసెన్సులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాత్కాలిక బాణసంచా విక్రయాలకు అనుమతులు పొందిన వారంతా నిర్ణీత ప్రాంతంలోనే విక్రయాలు జరపాలన్నారు. షాపుల వద్దకు చిన్న పిల్లలను, అనుమతించరాదన్నారు. దుకాణాల వద్ద పూర్తిస్థాయిలో నీరు, ఇసుక తదితర వాటిని తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. దుకాణాల మధ్య దూరం మూడు మీటర్ల ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి ఎవరైనా జనసంచార స్థలాల్లో విక్రయాలు జరిపినా, అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు పెట్టినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

సీఎం జగన్‌కు అన్ని వర్గాల ఆదరణ

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలూ హర్షం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కడియం మండల పార్టీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. మండలంలోని దామిరెడ్డిపల్లిలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా, అర్హత ఉన్న ప్రతి ఒక్క ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఇదే విషయాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. అలాగే రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ చేసిన కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, ఈవోపీఆర్‌డీ లక్ష్మి, ఉపసర్పంచ్ ముద్రగడ జెమి, మాజీ సర్పంచ్ ముద్రగడ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ రంపం గోపాలకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


దామిరెడ్డిపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్, చిత్రంలో పార్టీ నాయకులు, అధికారులు


27వ డివిజన్‌లో బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న మిండి నాగేంద్ర తదితరులు

రూ.24.56 కోట్లతో అభివృద్ధి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలక సంస్థ పరిధిలోని 27వ డివిజన్ ఇన్నీసుపేట 35వ వార్డు సచివాలయం పరిధిలో ప్రజలకు నాలుగున్నరేళ్ల కాలంలో రూ.24.56 కోట్ల లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మిండి నాగేంద్ర అన్నారు. శుక్రవారం సాయంత్రం ఇన్నీసుపేట గోగులమ్మగుడి వద్ద వార్డు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన, డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి రాజమౌళి, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. అనంతరం డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ ఆర్ఐ చినబాబు, అడ్మిన్ వెంకటేష్, వెల్ఫేర్ రంజిత్, సచివాలయ కన్వీనర్లు సబ్బెళ్ల విజయదుర్గారెడ్డి, కల్లి అప్పలరెడ్డి, రొక్కం వంశీ, రాపర్తి భాగ్యలక్ష్మి, వనుము బుజ్జి, రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కాపు భాను, అంగాడ సత్యప్రియ, షేక్ ఇమామ్, పడమట కామరాజు, వంగల భరతుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే జగన్ లక్ష్యం

ధవళేశ్వరం: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు అనుసూరి పద్మలత అన్నారు. ధవళేశ్వరం సచివాలయం-5 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన అనుసూరి పద్మలత మాట్లాడుతూ వైఎస్ జగన్ చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ అధికారి కె.సుధాకర్ ఆధ్వర్యంలో వైద్యులు రోహిత, నాగదేవి సేవలందించారు. శిబిరంలో 624 మందికి పరీక్షలు నిర్వహించగా 11 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు గోలి దేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, బొడ్డేటి శివాజీ, సాదే సురేష్, బలగం ప్రమోద్, గొన్నా సత్తిబాబు, పూడి విజయ్, పెన్నాడ లక్ష్మి, బోడపాటి కుమార్, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు, అధికారులు

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు తమ తోటి వారితో స్నేహపూర్వకంగా, సోదరభావంతో మెలగాలని, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సెయింటాన్స్ స్కూల్లో నల్సావారి బాల బాలికలకు స్నేహపూర్వక న్యాయసేవలు, వారి సంరక్షణ పథకం-2015పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎం.కిశోర్ కుమార్ మాట్లాడుతూ బాలకలు అప్రమత్తంగా ఉండాలని, అన్యాయం జరిగితే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలన్నారు. ప్యానల్ లాయర్లు డి.వెంకటేశ్వరరావు, జి.దేవీభవాని, రాజమహేంద్రవరం దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అమీనా బేగం మాట్లాడారు. సదస్సులో సెయింటాన్స్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఝాన్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

పుణ్యస్నానాలకు ఇబ్బంది లేకుండా చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక మాసంలో పుణ్యస్నానాలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కమిషనరు దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, ప్రజారోగ్యశాఖ అధికారులతో కలిసి నగరంలోని ఘాట్లను సందర్శించారు. అన్ని ఘాట్లలోనూ మెట్ల వద్ద లోతును, బురదను పరిశీలించి అవసరమైన మేరకు ఇసుకను వేయాలన్నారు. స్త్రీలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని, ఘాట్ల వద్ద అన్ని విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలన్నారు. ఘాట్లలో షిఫ్టుల ప్రకారం పారిశుధ్య కార్మికులకు విధులు అప్పగించాలన్నారు. తగినన్ని ప్లాస్టిక్ చెత్తకుండీలను ఏర్పాటు చేయాలన్నారు. రక్షణ వలయంగా పడవలను, గజఈతగాళ్లను నియమించాలన్నారు. ఆయన వెంట అసిస్టెంటు కలెక్టర్ యశ్వంత్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న ఉన్నారు.


ఘాట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

అన్నసమారాధన

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. శ్రీదేవి శరన్నవ రాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు, ఆలయ గౌరవ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


భక్తులకు అన్నం వడ్డిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

కానిస్టేబుల్‌ను గాయపరిచిన లారీడ్రైవర్‌కు ఏడేళ్ల జైలు

కడియం: కానిస్టేబుల్‌పై కత్తితో దాడిచేసి గాయపరిచిన లారీడ్రైవర్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం సెషన్స్ కోర్టు జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా కట్టని పక్షంలో మరో రెండు నెలలు సాధారణ జైలుశిక్ష విధించారు. వివరాల్లోకి వెళితే.. 2016 డిసెంబర్ 26వ తేదీ రాత్రి కడియం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జే.శేఖర్‌గాంధీ, హోంగార్డు ఏ.విజయకుమార్‌తో కలిసి రాత్రి సమయంలో కడియం మండలంలో గస్తీ నిర్వహిస్తున్నారు. అదే రోజు రాత్రి సుమారు 12 గంటల సమయంలో వారు ఎన్‌హెచ్-16 పొట్టిలంక గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఆగిఉన్న ఓ లారీని పక్కకు తీయాలని డ్రైవర్‌కు శేఖర్ గాంధీ చెప్పాడు. దీంతో లారీ డ్రైవర్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జుగ్రుప్ సింగ్ తన లారీ కాబిన్ నుంచి ఒక పొడవాటి కత్తి తీసి శేఖర్‌గాంధీ తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఆయనకు గాయమైంది. హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కడియం ఇన్‌స్పెక్టర్ ఎం.సురేష్ కేసు నమోదు చేసి, జుగ్రుప్ సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు 2018లో ట్రయిల్‌కు రాగా సదరు నిందితుడు కోర్టుకు సక్రమంగా హాజరుకాకపోవడంతో అతనిపై కోర్టు నాన్‌బెయిల్‌బుల్ వారంట్ జారీ చేసింది. ఈఏడాది జూన్‌లో కడియం ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్, సిబ్బంది ఎస్సై కె.ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుళ్లు కె.సురేష్‌కుమార్, కె.శ్రీనివాస్ సహాయంతో పంజాబ్ రాష్ట్రంలో రిమాండ్‌ఖైదీగా ఉన్న జుగ్రుప్‌సింగ్‌ను రాజమహేంద్రవరం సెషన్స్‌కోర్టులో హాజరుపర్చడం జరిగింది. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరం రుజువుకావడంతో రాజమహేంద్రవరం సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్ కుమార్ పైవిధంగా తీర్పునిచ్చారు. కాగా.. జుగ్రుప్ సింగ్‌పై పంజాబ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో సుమారు 30 క్రిమినల్ కేసులు, గంజాయి, అక్రమంగా ఆయుధాలు కలిగిన కేసులు ఉన్నాయి. ఇతడు ఓ గ్యాంగ్‌స్టర్, అంతర్రాష్ట్ర కరుడుగట్టిన నేరస్తుడు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సీటీఆర్ఐ: గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం రాత్రి కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ మాధవీలత ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వీటిపై ప్రజలకు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి

మధురపూడి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేయాలని తహసీల్దార్ పాపారావు అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనం మీటింగ్ హాలులో శుక్రవారం వ్యవసాయ శాఖ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు ప్రయాస లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు మాట్లాడారు.

మహిళా సాధికారతకు సీఎం జగన్ కృషి

రాజానగరం: రాష్ట్రంలో మహిళల రక్షణతో పాటు వారి సాధికారత, సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కొత్త వెలుగుబంద, పాత వెలుగుబంద గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో మహిళలకు ఇచ్చిన, ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. వివిధ రకాల సంక్షేమ పథకాలే కాకుండా రికార్డు స్థాయిలో 31.5 లక్షల మందికి పంపిణీ చేసిన నివాస స్థలాల పట్టాలను కూడా మహిళల పేరుతోనే అందజేశారన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా దిశ చట్టాన్ని తీసుకురావడంతో పాటు దిశ పోలీసు స్టేషన్లు కూడా ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాక గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధులు, చేపట్టిన పనుల వివరాలను కూడా తెలియజేశారు. ప్రతి మహిళ ఆర్థికంగా ప్రగతిని సాధించాలనే తలంపుతో పనిచేస్తున్న జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడం బాధ్యతగా ప్రతి మహిళ గుర్తించాలన్నారు.

సినిమాలు



శ్యామల	జిగర్‌తండ
సూర్యమినీ	ది మార్వెల్స్
సూర్యప్యాలెస్	జిగర్ తండ
స్వామి	టైగర్ నాగేశ్వరరావు
శివజ్యోతి	మాఊరి పొలిమేర-2
అనుశ్రీ	భగవంత్ కేసరి
రాజా	జపాన్
అశోక	జపాన్
ఊర్వశి	కీడాకోలా
రంభ	జపాన్
మేనక	లియో
అప్సర	ది మార్వెల్స్, మాఊరి పొలిమేర-2

నామవరం

వీఎస్ మహల్	జిగర్‌తండ, జపాన్

ధవళేశ్వరం

మురళీకృష్ణ	జపాన్

కడియం

వెంకటసూర్య	జిగర్‌తండ, జపాన్

క్లుప్తంగా

తెలుగు భాషకు బ్రౌన్ సేవలు చిరస్మరణీయం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజబాబు

సీటీఆర్ఐ: తెలుగు సాహిత్యానికి బ్రౌన్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన లేకపోతే వేమన లాంటి మహాకవులు కనుమరుగయ్యేవారని నన్నయ్య విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాగౌతమి, తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తరపట్ల మాట్లాడుతూ బ్రౌన్ 1820లో కడప కలెక్టర్‌కు సహాయకుడుగా పనిచేసే కాలంలోనే తెలుగు భాష అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. దాదాపు 70కి పైగానే గ్రంథాలను రక్షించేందుకు తన జీతాన్ని, జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి సీపీ బ్రౌన్ అని తెలిపారు. కార్యక్రమానికి తెలుగు శాఖ అధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు, డాక్టర్ డీవీ రమణమూర్తి, డాక్టర్ గాలి వెంకట రమణ, పల్లి సుధ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


జనార్దనరావు, అధ్యక్షుడు


శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి

రాజమహేంద్రవరం రూరల్: యూటీఎఫ్ రూరల్ మండల నూతన కమిటీ ఎన్నిక స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం రాత్రి జరిగింది. అధ్యక్షుడిగా జనార్దనరావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, ఇతర కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు. పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి రవిబాబు, ఎన్నికల అధికారిగా జిల్లా యూటీఎఫ్ సహ అధ్యక్షురాలు విజయ గౌరి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేష్, బంగారు రాజు, నానాజీ, సరోజిని, ప్రకాష్, అనిల్, రాముడు పాల్గొన్నారు.

14న అప్రెంటిస్ శిక్షణకు పరీక్ష

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఏపీ పేపర్‌మిల్స్ లిమిటెడ్‌లో అప్రెంటిస్ శిక్షణ కోసం ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈ నెల 14వ తేదీ ఉదయం 8.30 గంటలకు ధవళేశ్వరంలోని ప్రభుత్వ ఐటీఐలో రాత పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరరావు తెలిపారు. వివిధ ట్రేడులలో సుమారు 150 ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఎంపికైన వారికి ఏడాది పాటు శిక్షణ ఇస్తారని, శిక్షణ కాలంలో సుమారు రూ.7 వేలు స్టయిఫండ్‌గా అందిస్తారన్నారు.

సౌండ్ సిస్టమ్ వితరణ

కడియం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రముఖ నర్సరీ రైతు పల్ల వెంకన్న జ్ఞాపకార్థం ఆయన కుమారులు రూ. 25 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను శుక్రవారం అందజేశారు. ఈ మేరకు స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం టి.సత్యనారాయణకు వెంకన్న కుమారులు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, గణపతి అందించారు. ఈ సందర్భంగా దాతలను స్కూలు సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

కంబాలచెరువు: స్థానిక దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 1994వ సంవత్సరం ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కేబుల్ మూర్తి, నిర్మల్ కుమార్, అనిశెట్టి బాబీ, దుర్గా ప్రసాద్, ప్రభాకర్, వెంకటలక్ష్మి, గేదెల శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

పాలస్తీనాపై యుద్ధం ఆపాలి

ప్రకాశం నగర్: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయేల్ యుద్ధాన్ని ఆపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తాటితోట సెంటర్‌లో సీపీఐ, సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ స్టేడియం వరకూ ప్రదర్శన చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల నిర్మాణానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ: పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి విద్య, వైద్య ఆర్థికంగా ఎన్నో మార్పులు తీసుకువచ్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం అన్నారు. శుక్రవారం 31వ డివిజన్ అన్నపూర్ణమ్మపేటలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మహనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, అబ్దుల్ కలాం విగ్రహాలను కూడా ఒకే చోట నెలకొల్పుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ లంక సత్యనారాయణ, నల్ల రామాంజనేయులు, క్లస్టర్ శ్రీ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారి పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలోని మీనాక్షి కాలనీలో రూ.25 లక్షలతో అంతర్గత రహదారి పనులను చేపడుతున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. శుక్రవారం ఉదయం జిల్లా పంచాయతీ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జేసీ మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని మౌలిక సదుపాయల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామపంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ, పార్టీ నాయకులు బొప్పన సుబ్బారావు, చీరా రాజు, కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్, సచివాలయ గ్రేడ్-5 సెక్రటరీ రవితేజ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కడియం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కడియం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం కోరారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏవో కె.ద్వారకాదేవి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. గోపాలం మాట్లాడుతూ గతేడాది ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ, రైతులకు అన్ని విధాలా తోడ్పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కామన్ రకం క్వింటాల్‌కు రూ.2,183, అలాగే 75 కేజీలకు రూ.1,637.25గా, గ్రేడ్ ఏ రకం క్వింటాల్‌కు రూ.2,203. అలాగే 75 కేజీలకు రూ.1,652.25గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హమాలీ చార్జీలుగా క్వింటాల్‌కు రూ.22 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కిలోమీటరుకు టన్నుకు రూ.260 కూడా చెల్లిస్తారన్నారు. 8 నుంచి 20 కిలోమీటర్ల వరకూ ఏడు రూపాయలు ఇస్తుందన్నారు. కడియం ఆవలోని పంట కాలువను బాగు చేయించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సలహా మండలి సభ్యులు, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.